కిషన్‌రెడ్డిని ప్రజలు నమ్మరు: కాలేరు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ: సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ప్రజలు నమ్మేస్థితిలో లేరని, గత ఐదేళ్లలో ఎంపీగా, కేంద్రమంత్రిగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన అభివృద్ధి శూన్యమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎప్పుడూ ప్రజాసమస్యలు పట్టించుకోని, బస్తీల్లో, కాలనీల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టని కిషన్‌రెడ్డికి ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదని అన్నారు. తన స్వార్థం తప్ప వేరే ఆలోచనే కిషన్‌రెడ్డికి ఉండదని, కేంద్ర మంత్రిగా ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉన్నా ఏ ఒక్కరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలిచే విధంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బి.ఓంప్రకాష్ యాదవ్, కె.సదానంద్, పి.గెల్వయ్య, ఎస్.శ్రీశైలం, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునీల్ బిడ్లాన్, బబ్లూ సింగ్, బి.కృష్ణాగౌడ్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపించండి.. సేవ చేస్తా..

ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ విజ్ఞప్తి


సమావేశంలో మాట్లాడుతున్న దానం నాగేందర్, అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: 'పార్లమెంటు ఎన్నికల్లో ఒక్కసారి ఎంపీగా గెలిపించండి. మీకు సేవ చేస్తా'అని కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అన్ని వర్గాల ప్రజల మద్దతుతో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని దానం ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ముషీరాబాద్‌లోని కక్షిష్ హాల్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద కుమార్‌యాదవ్ అధ్యక్షతన కాంగ్రెస్ నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఒక్కరోజు కూడా ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు బస్తీలలో తిరగలేదని ఆరోపించారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాదని మభ్యపెడుతూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేసినా రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచారన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ న్యాయయాత్ర దేశ ప్రజల సంక్షేమం కోసం నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజిద్ హుస్సేన్, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జీ గౌరీశంకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు సంగపాక వెంకట్, పార్టీ సీనియర్ నాయకుడు జి.నాగభూషణం, మోహిన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లవెల్లి అంజిరెడ్డి, పార్టీ సీనియర్‌నేత పెండెం శ్రీనివాస్ యాదవ్, పట్నం నాగభూషణంగౌడ్, మారిశెట్టి నర్సింగ్‌రావు, అభిషేక్‌కెనడి, డాక్టర్ మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

'అనలాగ్ ఐఏఎస్ అకాడమీ'కి 50 ర్యాంకులు


హానితతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న శ్రీకాంత్ విన్నకోట

ముషీరాబాద్: ప్రతి సంవత్సరం మాదిరిగానే 2023 సివిల్స్ ఫలితాల్లో కూడా 'అనలాగ్ ఐఏఎస్ అకాడమీ'విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని, 2023 సంవత్సరానికి ఆల్ ఇండియా ర్యాంకులు 11, 16, 47, 50 ఇలా టాప్ 50 నాలుగు ర్యాంకులతోపాటు మొత్తం 50 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని డైరెక్టర్ శ్రీకాంత్ విన్నకోట తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో అత్యుత్తమ ర్యాంకు అయిన ఆల్ ఇండియా ర్యాంకు 82 సాధించిన తమ విద్యార్థి మెరుకు కౌశిక్‌ను ఆయన అభినందించారు. తమ దగ్గర కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు ప్రతి రోజు ప్రాక్టీస్ టెస్టులతోపాటు మెంటార్‌షిప్, స్టడీ హాల్, లైబ్రరీ సౌకర్యాలు కల్పించి ఒక సంవత్సర ప్రణాళికతో ముందుకు వెళ్లడం వల్లనే తమ ఇన్‌స్టిట్యూట్‌కు ఇన్ని ర్యాంకులు వచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు 887వ ర్యాంకు సాధించిన హానితను పుష్పగుచ్ఛంతో అభినందించారు.

రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీకి 23 ర్యాంకులు


నాగభరత్‌ను సత్కరిస్తున్న అకాడమీ చీఫ్ మెంటార్ వివేకానంద తదితరులు

ముషీరాబాద్: సివిల్ సర్వీసెస్–2023 ఫలితాలలో రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ సత్తాచాటింది. ఇక్కడ తర్ఫీదు పొందిన అభ్యర్థుల్లో 23కు పైగా ర్యాంకులు సాధించినట్లు అకాడమీ చీఫ్ మెంటార్ గడియారం వివేకానంద తెలిపారు. 2030 నాటికి వంద మంది ఐఏఎస్, మరో వంద మంది ఐపీఎస్‌లను దేశానికి అందించడమే అకాడమీ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 2014లో సివిల్ సర్వీసెస్ సాధించిన వివేకానంద ఈ అకాడమీని స్థాపించిన మూడు సంవత్సరాల్లోనే 44 మంది విద్యార్థులు సివిల్స్‌కు అర్హత సాధించడం ఆనందంగా ఉందని విలేకరుల సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్స్ ముప్పాళ్ల రాము, సిఎల్ఎన్ ధవేజీలు తెలిపారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట: బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

'లా ఎక్సలెన్స్'కు ర్యాంకుల పంట

చిక్కడపల్లి: సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో అశోక్‌నగర్‌లోని 'లా ఎక్సలెన్స్'కు ఐఏఎస్ అకాడమీకి మంచి ర్యాంకులు వచ్చాయి. ఈ సందర్భంగా అకాడమీ అధినేత రాంబాబు మాట్లాడుతూ తమ అకాడమీకి 35 ర్యాంకులు వచ్చాయని ఇందులో, 200లోపు ర్యాంకులు ఉండటం గర్వకారణమని అన్నారు. సందర్భంగా 703 ర్యాంకర్ రాజ్‌కుమార్ చౌహాన్‌తో పాటు ఇతరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజకుమార్ చౌహాన్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జిల్లా గిరిజన ప్రాంతానికి చెందిన తాను ఐఏఎస్‌కు సెలక్ట్ కావడం సంతోషంగా ఉందని, పేదలకు సేవ చేసే అవకాశం లభించిందని అన్నారు.

'మార్కెటింగ్ ట్రెండ్స్' పై జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రొ.అప్పారావు

కాచిగూడ: 'భారతదేశంలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో ఇటీవలి ట్రెండ్స్'అనే అంశంపై నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్‌లో మంగళవారం రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. దేశ వ్యాప్తంగా వివిధ కళాశాలల విద్యార్థులు, విద్యావేత్తలు, పరిశోధనా పండితులు, పరిశ్రమల నిపుణులు పాల్గొని సెమినార్ సావనీర్‌లో ప్రచురించిన పరిశోధన ఫలితాలను ఈ సందర్భంగా సమర్పించారు. ప్రతి సవాలులో ఒక అవకాశం ఉంటుందని, ప్రతి అడ్డంకిలో ఆవిష్కరణకు మార్గం ఉంటుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలివైన చర్చలు, ప్రకాశవంతమైన ప్రదర్శనలు, సహకార మార్పిడిలు జరిగి జ్ఞానాన్ని పంచుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అప్పారావు, భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ ఎస్.జైకిషన్, డాక్టర్ వై.అశోక్, డాక్టర్ విద్యాధర్ రెడ్డి, డాక్టర్ ఎస్ రాజేశ్వర్ రావు, ప్రొఫెసర్ డాక్టర్ ఇంద్రకంటి శేఖర్, డాక్టర్ వరలక్ష్మీ, డాక్టర్ కె.నిర్మల, కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు చైర్మన్ పి.కృష్ణారావు, కె.అర్చన, ఎ.మాధవి తదితరులు పాల్గొన్నారు.

21న సామూహిక ఉపనయనాలు


అనంతలక్ష్మికి ఆహ్వాన పత్రిక అందజేసిన సురేష్ చందర్‌రావు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 21న సామూహిక ఉపనయనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సురేష్ చందర్‌రావు చెప్పారు. కర్మన్‌ఘాట్ టీకేఆర్ కాలేజీ సమీపంలో గల అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉపనయనాలు ఉంటాయన్నారు. ఈ మేరకు బుధవారం ప్రముఖ ప్రవచకులు డాక్టర్ అనంతలక్ష్మిని కలిసి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ ప్రతినిధులు విజయ, యలమంచిలి, కృష్ణవేణి, సీహెచ్ లలిత తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల ఐక్యతను దెబ్బతీస్తున్నారని నిరసన


ధర్నా నిర్వహిస్తున్న మున్నూరు మహాసభ ప్రతినిధులు

కాచిగూడ: మున్నూరుకాపుల ఐక్యతను మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ప్రాంగణంలోని మహాసభ కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా మెయిన్ గేటుకు తాళం వేసి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మ్యాడం వెంకట్‌రావు అడ్డుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో లింగిశెట్టి హనుమంతరావు, బి.ఆర్.జితేందర్, మణికొండ రమేష్ కుమార్, కట్టెల సుభాష్, షేక్‌పేట పెంటయ్య, నర్సింగ్‌రావు, కొంతం సురేష్ బాబు, గోపాల రాధకృష్ణ, గంగం రవి, శ్రీనివాస్, పిల్లి మాణిక్ ప్రభు, రవికాంత్, ప్యాట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ


స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న వెంకట్‌రావు

కాచిగూడ: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని, అప్పుడే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలుగుతారని మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు అన్నారు. తండ్రిలేని పేద మున్నూరుకాపు విద్యార్థినీవిద్యార్థులకు మంగళవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో స్కాలర్ షిప్ చెక్కులను ఆయన ప్రదానం చేశారు. మొత్తం రూ.11,03,500 మేర స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు చెక్స్ ద్వారా వితరణ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు పన్నాల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస్ రావు, ఎలగందల దేవేందర్, అమరం చంద్రశేఖర్, విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యవిద్యలో రేష్మకు బంగారు పతకం



అంబర్‌పేట: జైస్వాల్ గార్డెన్‌కు చెందిన డాక్టర్ రేష్మా వైద్యవిద్యలో జాతీయస్థాయి బంగారు పతకాన్ని సాధించింది. నేషనల్ బోర్డు ఆఫ్ ఎక్సమినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎమ్ఎస్) జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈఎన్‌టీ విభాగం, డీఎన్‌బీ తుదిపరీక్షల్లో తాను మొదటిర్యాంకు సాధించినట్లు ఆమె మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో ఆమెకు బంగారు పతకాన్ని ప్రకటించారు. మే 10న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కోటి ఈఎన్‌టీ అసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆమె బంగారు పతకం సాధించడంతో తల్లిదండ్రులు శారద, వినోద్‌కుమార్‌తో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ అభినందించారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: నరేంద్రమోదీ సారథ్యంలో మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లో ఇంటింటి వెళ్లి మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, పార్టీ నాయకులు రాజు, ఆయుష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ బీజేపీ' ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాగభూషణంచారి

అంబర్‌పేట: మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిగా చేయడమే ధ్యేయంగా కృషి చేయాలని ఆ పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి అన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బూత్ స్థాయిలో ముమ్మర ప్రచారం నిర్వహించి బీజేపీకి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, వెంకటాచారి, మాణిక్, సురేందర్, చందు, సాయిరామ్, రాజు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


కష్టకాలంలో పార్టీని వీడటం తగదు: గోపాల్

ఎమ్మెల్యే బుజ్జగింపుతో రాజీనామాను విరమించుకున్న సోమన్


సోమన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: కష్టపడి పనిచేసే నాయకులకు పదవులు కేటాయించే విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు టి.సోమన్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో మంగళవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. భవిష్యత్‌లో న్యాయం చేస్తామని, కష్టకాలంలో పార్టీని వీడటం సమంజసం కాదని అన్నారు. ఎమ్మెల్యే బుజ్జగించడంతో సోమన్ తన రాజీనామాను విరమించుకుంటున్నానని తెలిపారు. ముఠా గోపాల్ సారథ్యంలో పార్టీ కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, నేతలు డి.శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, టి.శ్రీకాంత్‌ముదిరాజ్, శంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జువైనల్ హోమ్ నుంచి పారిపోయిన బాలిక



కాచిగూడ: జువైనల్ హోమ్(బాలికల సదన్) నుంచి ఓ బాలిక పారిపోయిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఓల్డ్‌సిటీ మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన హనుమంతు కుమార్తె ప్రియగిరి(17)ను కాచిగూడ, నింబోలిఅడ్డలోని బాలికల సదన్‌కు 2023 జనవరిలో తీసుకువచ్చారు. మంగళవారం మధ్యాహ్నం సిబ్బంది, సెక్యూరిటీ గార్డు కళ్లు గప్పి కాంపౌండ్‌వాల్ దూకి పారిపోయింది. దీనిపై బాలికల సదన్ సూపర్‌వైజర్ సావిత్రి కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళిత బహుజన అభ్యర్థులను గెలిపించండి

లిబర్టీ: దళిత బహుజన అభ్యర్థులను చట్టసభల్లోకి పంపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరు కృష్ణస్వరూప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానంతో, గౌతమ బుద్ధుని తాత్విక వెలుగులో సమతా రాజ్యాన్ని స్థాపించాలని కోరారు. దళితుల అభ్యర్థులను లోక్‌సభకు పంపిస్తే దళిత సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

హెరిటేజ్ సిటీగా నామినేట్ చేసేందుకు కృషి

బంజారాహిల్స్: ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరాన్ని ఈ ఏడాది యునెస్కో నిర్వహించే హెరిటేజ్ సదస్సులో హెరిటేజ్ సిటీగా నామినేట్ చేసేందుకు తాము కృషి చేస్తున్నట్లు చరిత్రకారిణి, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్, అర్బన్ ప్లానర్ వసంత శోభ తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెరిటేజ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

మజ్జిగ కేంద్రానికి ఆర్థికసాయం


రేఖ జహుర్‌కర్, సంజుక్త సేన్‌లను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజికసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములై పేదలకు అండదండగా ఉండాలని ఆదర్శ్ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షురాలు లయన్ రేఖ జహుర్‌కర్ అన్నారు. మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వీఎస్‌టీ రోడ్‌లో నిర్వహిస్తున్న మజ్జిగ కేంద్రాన్ని ఆమె పరిశీలించి నిర్వాహకులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రేఖ జహుర్‌కర్, లయన్ సంజుక్త సేన్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాతావాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధర్, ఉపాధ్యక్షులు నీలా శ్రీధర్, కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి కోనేరు జైహింద్, సలహాదారులు శరత్‌కుమార్, కేశవ్‌రావు దేశ్‌పాండే, జాయింట్ సెక్రటరీ కేశవచంద్ర, వినోద్‌కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి భర్త ఆత్మహత్య

కాచిగూడ: భార్యభర్తలు గొడవ పడి మనస్తాపంలో భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఓల్డ్ మలక్‌పేట, శంకర్‌నగర్ ప్రాంతానికి చెందిన స్వామి కుమారుడు, విశ్రాంత సహకార ఉద్యోగి ఎస్. సుదర్శన్ (63) మలక్‌పేట – కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య గొడవ జరుగుతోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే పోలీసులు ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ధనుంజయ (53) ఉప్పుగూడ – ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'శ్రీరామనవమి'కి ఆలయాలు ముస్తాబు


శ్రీరామ నవమికి ముస్తాబైన న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం


న్యూరామాలయంలో కొలువుదీరిన శ్రీసీతారామచంద్ర స్వాములు

నల్లకుంట: శ్రీరామనవమి వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి దేవాలయం(న్యూ రామాలయం)లో శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణ అధికారి(ఈవో) జె. మార్తాండరావు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం ఎదుట, ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయించామన్నారు. శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో 'శ్రీరామ నవమి'వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు.

అంబర్‌పేట/కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆలయాలు సీతారాముల కల్యాణ వేడుకలకు ముస్తాబయ్యాయి. బాగ్ అంబర్‌పేట బుర్జు గల్లీలో హనుమాన్ ఆలయం, అనంతరామ్‌నగర్ కాలనీలోని హనుమాన్ ఆలయం, చెన్నారెడ్డినగర్, మల్లికార్జుననగర్, జైస్వాల్ గార్డెన్, ఛే నంబర్ చౌరస్తా ఆలయాల్లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. శ్రీ సూర్యభగవాన్ హనుమాన్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో బర్కత్‌పుర, లింగంపల్లిలోని ఆలయ ప్రాంగణంలో ఈ నెల 17న బుధవారం ఉదయం 11:45 గంటలకు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్.శ్రీశైలం, వి.మల్లేష్, కిష్టయ్య, ఎం.భీంయాదవ్ తెలిపారు.

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ దోమలగూడ అడ్వకేట్స్ కాలనీలో ఉన్న శ్రీబాలా త్రిపురసుందరీ దేవి ఆలయంలో బుధవారం నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవానికి అన్నివర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి పంచముఖి హనుమాన్ ఆలయ చైర్మన్ మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. సీతారాముల కళ్యాణం అనంతరం ఆలయంలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.


రవీందర్

కన్నులపండుగగా ఎదురుకోళ్లు


ఎదుర్కుకోళ్ళు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణాంతర ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఎదురుకోళ్ల కార్యక్రమం కన్నులపండుగగా నిర్వహించారు. బుధవారం సీతారామకల్యాణం జరుగుతున్న నేపథ్యంలో జరిగిన ఈ ఎదుర్కోళ్ళు కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొన్నారు. అంతకుముందు హనుమత్ కార్యక్రమం ఈవో దేవనాథం పర్యవేక్షణలో జరిగింది.